సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 3 । నవంబర్ । 2023

రాజన్న సేవలో హనుమాన్ దీక్షా పీఠాధిపతి



వేములవాడ: రాజన్నను హనుమాన్ దీక్షా పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామీజీ గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసిన తర్వాత అద్దాల మండపంలో కండువా, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో బ్రాహ్మణగారి శ్రీనివాస్, పర్యవేక్షకులు గోలి శ్రీనివాస్, సిరిగిరి శ్రీరాములు, స్థానాచార్యులు అప్పాల భీమశంకరశర్మ ఉన్నారు.

న్యూస్‌రీల్

దళితుల అభ్యున్నతికి పాటుపడతా



చందుర్తి(వేములవాడ): దళిత అభ్యున్నతికి కృషిచేస్తానని వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. చందుర్తిలోని పెరుక కమ్యూనిటీ భవనంలో గురువారం నిర్వహించిన దళితుల ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా దళితులు చల్మెడకు మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారు. మ్యాకల ఎల్లయ్య, దప్పుల అశోక్, బత్తుల కమలాకర్, దుమ్ము అంజయ్య, సంటి బాపురావు, కొమ్ము రమేశ్, గుడిసె రమేశ్, నగరం శంకర్, మందాల ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దాడులు



రుద్రంగి(వేములవాడ): ప్రజాస్వామ్యంలో ఎవరైనా పోటీచేసి ప్రజల ఆశీర్వాదంతో గెలిచే అవకాశం ఉందని.. కొందరు నియంతృత్వ పోకడలతో ప్రజల నమ్మకాన్ని కోల్పోయి, ఓడిపోతామన్న భయంతో దాడులకు దిగుతున్నారని డీసీసీ అధ్యక్షుడు, వేములవాడ అభ్యర్థి ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బెదిరింపులకు భయపడేది లేదన్నారు. రుద్రంగిలో గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో గురువారం పాల్గొని మాట్లాడారు. రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత, చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, తర్రె మనోహర్, సామ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తల జోలికొస్తే జాగ్రత్త



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నియోజకవర్గంలో పార్టీ బలోపేతాన్ని చూసి ఓర్వలేక తమ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని, కార్యకర్తల జోలికొస్తే ఖబర్దార్ అని బీజేపీ అభ్యర్థి రాణి రుద్రమ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేటలో పార్టీ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఇసుక మాఫియా రాజ్యమేలుతుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, జిల్లా ఉపాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పాన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మారెడ్డి, సత్యంరెడ్డి ఉన్నారు.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని రాణి రుద్రమా ప్రారంభించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సందవేని రాజు, నాయకులు ఆడెపు రవీందర్, గజభీంకార్ సంతోష్, సిరిసిల్ల వంశీ, కోల అంజనేయులు, కోడం భవిత పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా లగిశెట్టి శ్రీనివాస్



సిరిసిల్ల: సిరిసిల్ల ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని పారిశ్రామికవేత్త, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు లగిశెట్టి శ్రీనివాస్ గురువారం వెల్లడించారు. 2016లో సిరిసిల్ల పట్టణ 'సెస్' డైరెక్టర్‌గా ఎన్నికైన లగిశెట్టి శ్రీనివాస్ 2016 నుంచి 2021 వరకు 'సెస్' వైస్‌చైర్మన్‌గా పనిచేశారు. స్వచ్ఛంద సంస్థను స్థాపించి పేదల పెళ్లిళ్లకు పుస్తెమట్టెలు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్‌లో చాలాకాలం పనిచేసి కొంతకాలంగా పార్టీకి దూరం ఉన్నారు. బీజేపీ టిక్కెట్ ఆశించి ఆ పార్టీలో చేరారు. ఎన్నికలకు ముందే సిరిసిల్లలో పోటీచేస్తానని ప్రకటించిన శ్రీనివాస్‌కు టికెట్ రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధపడ్డారు. తన తండ్రి లగిశెట్టి విశ్వనాథం పేరిట తంగళ్లపల్లి వద్ద వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. సంతోషిమాత ఆలయాన్ని సొంతంగా నిర్మించారు. లగిశెట్టి శ్రీనివాస్ పద్మశాలి సామాజికవర్గం కావడంతో బీసీ బిడ్డగా తనకు మద్దతు తెలపాలని గురువారం సోషల్‌మీడియా వేదికగా వేడుకున్నారు. సిరిసిల్లలో ఇప్పటికే పత్తిపాక సురేష్ ఇండిపెండెంట్‌గా పోటీచేస్తానని గురువారం పద్మశాలి ఆత్మగౌరవ సభను ఏర్పాటు చేసి వెల్లడించారు. ఈ నేపథ్యంలో లగిశెట్టి శ్రీనివాస్ సైతం సిరిసిల్ల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తానని ప్రకటించడం గమనార్హం. తాజా రాజకీయ పరిణామాలు చర్చనీయాంశమయ్యాయి.

అభ్యర్థుల ఎంపికలో తఖరారు!



- సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై జాప్యం
- వేములవాడలో బీజేపీ అభ్యర్థి ఎవరో?
- తేలని అభ్యర్థులతో శ్రేణుల్లో అయోమయం
- నేటి నుంచి నామినేషన్లు షురూ

సిరిసిల్ల: అసెంబ్లీ ఎన్నికల పర్వంలో తొలి ఘట్టానికి తెరలేస్తుంది. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలో శుక్రవారం నుంచి నామినేషన్ల పర్వం మొదలు కానుంది. అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేసి నామినేషన్ దాఖలు చేయించేందుకు ముహూర్తం చూసుకుంటున్నారు. శుక్రవారం నుంచి 10వ తేదీలోగా ఏదో ఒక్క రోజు నామినేషన్లు దాఖలు చేయాలని అన్ని పార్టీల అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ సిరిసిల్లలో తమ అభ్యర్థి ఎవరో ఇప్పటికీ ఖరారు చేయలేదు. సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ తరఫున తనకు టిక్కెట్ గ్యారంటీ అనే నమ్మకంతో కేకే మహేందర్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారు. మరోవైపు చీటి ఉమేశ్‌రావు కూడా కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. సిరిసిల్లకు చెందిన పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన మరో పారిశ్రామికవేత్తను రంగంలోకి దించే ఆలోచనతోనే ఇప్పటి వరకు అభ్యర్థి ఎవరో ప్రకటించలేదనే వాదన ఉంది. సిరిసిల్లలో బీఆర్‌ఎస్ పార్టీకి బలమైన అభ్యర్థి కేటీఆర్ ఉండడంతో ఆయన్ని ధీటుగా ఎదుర్కొనే వ్యక్తిని పోటీలో ఉంచాలని భావిస్తుందని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏది ఏమైనా నామినేషన్ల పర్వం మొదలైనప్పటికీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించకపోవడంపై ఆ పార్టీ శ్రేణులను ఒకింత నిరాశకు గురిచేస్తుంది. అభ్యర్థి ఎవరో తెలిస్తే క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని పరుగెత్తించొచ్చని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. అదే వేములవాడ నియోజకవర్గం అభ్యర్థిగా ఆది శ్రీనివాస్ పేరును మొదటి లిస్ట్‌లోనే వెల్లడించడంతో ఆయన క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. సిరిసిల్ల విషయంలో ఇంకా జాప్యం చేయడంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో అసహనం వ్యక్తమవుతుంది.

వికసించని కమలం

వేములవాడ నియోకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఎవరో ఇంకా కమలనాథులు తేల్చలేదు. సిరిసిల్లలో మాత్రం బీజేపీ అభ్యర్థి రాణీరుద్రమారెడ్డిని ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం మూడో జాబితాలోనూ వేములవాడ అభ్యర్థి ఎవరో తేల్చకపోవడం చర్చనీయాంశమైంది. వేములవాడ సీటు కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ పోటీ పడుతుండగా.. బీజేపీ సీనియర్ నేత, మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు తనయుడు డాక్టర్ వికాస్‌రావు గట్టిగా పట్టుబడుతున్నారు. వీరిద్దరితోపాటు వేములవాడకు చెందిన ఎర్రం మహేశ్ కూడా బీజేపీ టిక్కెట్ ఆశిస్తున్నారు. నామినేషన్ల పర్వం మొదలైనా కూడా కమలనాథులు ఇంకా వేములవాడ అభ్యర్థిని ఖరారు చేయలేదు. మరోవైపు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. జిల్లాలోని సిరిసిల్లలో కాంగ్రెస్ అభ్యర్థి, వేములవాడలో బీజేపీ అభ్యర్థి ఎవరో ఖరారు కాకపోవడం చర్చనీయాంశమైంది.

ఎన్నికల నివేదికలు వేగంగా అందించాలి



ఎన్నికల వ్యయపరిశీలకులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ఎన్నికలకు సంబంధించిన నివేదికలను వేగంగా సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సిరిసిల్లలోని పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని గురువారం పరిశీలించారు. అధికారులతో అక్కడే సమీక్షించారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన వ్యయ పరిశీలకులు, సాధారణ పరిశీలకులు జిల్లాకు వస్తున్నారని, వారికి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు సకాలంలో అందించాలని సూచించారు. విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. పంచాయతీరాజ్ అతిథి గృహంలోని అన్ని సూట్‌లలో టీవీలు, కంప్యూటర్ సిస్టమ్స్, వేడి నీళ్ల కోసం గీజర్, ఫ్రిజ్, ఫర్నీచర్, ఇన్వర్టర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వసతిగృహంలో విధులు నిర్వహించే సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, రిటర్నింగ్ అధికారులు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, నోడల్ అధికారులు సూర్యప్రకాశ్, సైదులు, కె.నర్సింహులు, ఎం.దశరథం, రవికుమార్, పర్యవేక్షకులు శ్రీకాంత్, రహమాన్ పాల్గొన్నారు.

వందమీటర్ల దూరంలో వాహనాల నిలిపివేత

- నామినేషన్‌కు అభ్యర్థి వెంట నలుగురికి అనుమతి
- నిబంధనలు పాటించాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నామినేషన్లు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయని, నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలోనే వాహనాలు నిలిపివేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్ వద్ద గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆనంద్‌కుమార్‌తో కలిసి నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు అన్ని పార్టీల అభ్యర్థులు, నాయకులు పాటించాలని సూచించారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితోపాటు మరో నలుగురిని అనుమతిస్తామన్నారు. అభ్యర్థి లేకపోయినా.. మొత్తంగా ఐదుగురిని మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతను, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సిరిసిల్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అన్ని రాజకీయపార్టీల అభ్యర్థులు, అనుచరులు ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. నామినేషన్లు వేసే వారి కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, సిరిసిల్ల తహసీల్దార్ ఎండీ షరీఫ్ మొహినొద్దీన్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలతోనే అధికారంలోకి

- టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు
- యువ ఆత్మీయ సమ్మేళన సభాస్థలం పరిశీలన



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తుందని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో ఈనెల 6న నిర్వహించే యువ ఆత్మీయ సమ్మేళన సభ స్థలాన్ని గురువారం పరిశీలించి మాట్లాడారు. మంత్రి కేటీఆర్ హాజరయ్యే ఈ యువ సమ్మేళన సభను విజయవంతం చేయాలని కోరారు. తంగళ్లపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల పార్టీ కార్యకర్తలు, యువజన సంఘాల బాధ్యులు హాజరుకావాలని కోరారు. కేటీఆర్‌ను ఐదోసారి ఎమ్మెల్యేగా లక్ష మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు అందె సుభాష్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, సందీప్, పర్శరాములు, గజన్‌నాయక్, హసన్, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీ అందించాలి



సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీ డబ్బులు చెల్లించాలని టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌ను నేతకార్మికులు కోరారు. ఈమేరకు వందలాది సంఖ్యలో కార్మికులు గురువారం ఆయన ఇంటికొచ్చి గోడు వెళ్లబోసుకున్నారు. వారం రోజుల్లోపు డబ్బులు వచ్చేలా చూస్తామని కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మూశం రమేశ్, మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్, సబ్బని చంద్రకాంత్, మోర తిరుపతి, బెజిగం సురేశ్ పాల్గొన్నారు.

శుభకార్యాలకు 'కోడ్' కష్టాలు!

- జిల్లాలో ఆరు చెక్‌పోస్టులు
- ఎన్నికల నిబంధనలతో సమస్యగా నగదు తరలింపు
- నగలు కొనేదెట్లా.. ఫంక్షన్‌హాళ్లకు అడ్వాన్స్ ఇచ్చేదెట్లా?
- ఆందోళనలో ప్రజలు
- పడిపోయిన వ్యాపారాలు

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని ఓ మండలకేంద్రానికి చెందిన కుటుంబంలో ఇటీవల పెళ్లి నిశ్చయమైంది. పెళ్లి పత్రిక మొదలుకొని బంగారునగలు, బాసన్లు, బట్టలు కొనుగోలుకు హైదరాబాద్, కరీంనగర్ వెళ్లేందుకు నిశ్చయించుకున్నారు. ఈక్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో జిల్లా చుట్టూ పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. దీంతో రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లడం ఇబ్బందిగా మారింది. చెక్‌పోస్టులు దాటేందుకు వీలుకావడం లేదు. ఓ వైపు ముహూర్తం దగ్గర పడుతుండడంతో పనులు పూర్తికాక ఆ కుటుంబం ఆందోళన చెందుతుంది. ఇలాంటి పరిస్థితి ప్రస్తుతం జిల్లాలోని వివాహాలు, శుభకార్యాలు పెట్టుకున్న చాలా కుటుంబాలలో ఉంది.



పెద్దమ్మ క్రాస్‌రోడ్డు వద్ద పోలీసుల తనిఖీలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): శుభముహూర్తాలు మొదలుకావడంతోనే ఎన్నికల కోడ్ వచ్చి పడింది. పెళ్లిళ్ల ముహూర్తాలు పెట్టుకుంటున్నారు. ఇదే సమయంలో పెళ్లిళ్లు, వివిధ శుభకార్యాలకు బంగారు నగలు కొనడం, ఫంక్షన్‌హాల్స్ బుక్ చేసుకోవడం, కట్నాలు, కానుకలు కొనుగోలు చేయడం అనేది పరిపాటి. కానీ ఈసారి శుభముహూర్తాలు మొదలైన సమయంలోనే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లడం ఇబ్బందిగా మారింది. పెద్ద మొత్తంలో డబ్బు తీసుకెళ్తుంటే చెక్‌పోస్టుల వద్ద పోలీసులు సీజ్ చేస్తుండడం ఇబ్బందిగా మారింది.

పట్నం వెళ్దామంటే పరేషాన్

బంగారు నగలు, వివిధ కట్నకానుకలు కొనాలంటే కరీంనగర్, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్తుంటారు. అయితే ఆయా మార్గాలలో జిల్లా చుట్టూ ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టుల్లో రాత్రింబవళ్లు తనిఖీలు చేపడుతున్నారు. ఎవరికీ మినహాయింపు ఇవ్వకుండా రూ.50వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తున్నారు. అదే సమయంలో బంగారునగలను సైతం సీజ్ చేస్తున్నారు.

నగదు బదిలీలకు నిబంధనలు

మధ్యతరగతి కుటుంబాలు పెళ్లి చేయాలన్నా రూ.లక్షల్లో ఖర్చవుతుంది. ఇక ఆర్థికంగా ఉన్న వారైతే కోటి రూపాయల వరకు చేరుతుంది. ఈక్రమంలో అందమైన అనుభూతిగా భావించే పెళ్ళిని ఘనంగా చేసుకోవాలని అందరూ భావిస్తారు. ఇందుకు ఖర్చుకు వెనుకాడడం లేదు. ఇందుకు ఎన్నికల కోడ్ ఆటంకంగా మారడంతో పెళ్లిళ్లు ఎలా చేసేదని ముహూర్తాలు ఉన్న వారు వాపోతున్నారు. అంతేకాకుండా పెళ్లికి అవసరమైన ఫంక్షన్‌హాల్స్, ఈవెంట్స్, డెకరేషన్, బ్యాండ్, పత్రికల ప్రింటింగ్, కట్నకానుకలు అనగా ఫర్నీచర్ తదితరాలకు నగదు రూపంలో లక్షల్లో డబ్బులు అవసరముంటాయి. నగదు రూపంలో డబ్బులు ఇస్తేనే పనులు జరుగుతాయి. ఫోన్ ద్వారా నగదు బదిలీ చేయాలన్న రోజుకు రూ.లక్ష వరకు మాత్రమే వీలుంది. ఈ స్థితిలో ఏం చేయాలో తెలియడం లేదని శుభకార్యాలు పెట్టుకున్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముహూర్తాలు ఇలా..

నవంబర్ మొదటి వారం నుంచి డిసెంబర్ 6 వరకు

ఈనెల 15, 18వ తేదీలతోపాటు డిసెంబర్ 6న అత్యధిక సంఖ్యలో పెళ్లిళ్లు ఉన్నాయి.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు



ఎన్నికల కోడ్ అమలులో ఎవరికీ మినహాయింపు లేదు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేపడుతున్నాం. రూ.50 వేలకు మించి నగదు, బంగారం తరలిస్తే నిబంధనల ప్రకారం సీజ్ చేస్తున్నాం. పెళ్లిళ్ల సీజన్ ఉన్నప్పటికీ ఎన్నికల నియమావళి పాటించాల్సిందే. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు.

– శశిధర్‌రెడ్డి, సీఐ, ఎల్లారెడ్డిపేట

ముహూర్తాలున్న పనులు లేవు



ఈనెల 18 నుంచి డిసెంబర్ 6 వరకు ముహూర్తాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పనులు సరిగ్గా లేవు. గతంలో పెళ్లిళ్ల సీజన్‌లో ఒక్కో స్వర్ణకారుడు రోజుకు 15 తులాల బంగారు ఆభరణాలు తయారు చేసేది. ఇప్పుడు కోడ్ ఉండడంతో నెల రోజులుగా ఎలాంటి పనులు లేక ఇబ్బందులు పడుతున్నాం.

– శ్రీగాథ రమేశ్, స్వర్ణకారుల సంఘం మండలాధ్యక్షుడు

50 శాతం గిరాకీ పడిపోయింది



ఈ సీజన్‌లో ఎన్నికల నిబంధనలతో బట్టల వ్యాపారం 50 శాతం వరకు పడిపోయింది. పెళ్లిళ్ల సీజన్‌లో ఇతర ప్రాంతాల నుంచి మంచి డిజన్ల బట్టలు నగదు రూపంలో డబ్బులు చెల్లించి తీసుకునే పరిస్థితి లేదు. ఫలితంగా ఉన్న స్టాక్‌తోనే వ్యాపారం చేయలేకపోతున్నాం. నగదు బదిలీ చేయడం ఇబ్బందిగా మారింది. ఎన్నికల కోడ్ నుంచి వ్యాపారులను మినహాయించాలని కోరినా పట్టించుకునే వారు లేరు.

– పాతు అంజనేయులు, బట్టల వ్యాపారి, ఎల్లారెడ్డిపేట

మీకు తెలుసా..?



ఎవరైతే ధర్మాన్ని సరిగా నిర్వర్తిస్తారో.. వారే దేశాన్ని ఉద్ధరించగలరు.
– డాక్టర్ బీఆర్. అంబేద్కర్

కాంగ్రెస్‌కు కాడెద్దు.. కమ్యూనిస్టులకు 'హస్తం'

కరీంనగర్: హస్తం గుర్తును మొదటి సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టులకు కేటాయించారు. 1952లో కాంగ్రెస్ పార్టీది కాడెద్ల గుర్తు కాగా, అప్పట్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆ గుర్తుపైనే పోటీ చేసింది. హైదరాబాద్ సంస్థానం మినహా దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ కమ్యూనిస్టు పార్టీలు కంకి, కొడవలి గుర్తుపై పోటీ చేశారు. హైదరాబాద్ సంస్థానంలో కమ్యూనిస్ట్ పార్టీపై నిషేధం ఉండడంతో ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) పేరిట ఎన్నికల్లో పోటీ చేశారు.



ఎన్నికల సంఘం పీడీఎఫ్ అభ్యర్థులకు హస్తం గుర్తును కేటాయించింది. అప్పటి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు చెయ్యి గుర్తు కేటాయించేది. 1957 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కమ్యూనిస్ట్ పార్టీలకు కంకి కొడవలి గుర్తు లభించింది .తరువాత కాలంలో కమ్యూనిస్టులు సీపీఐ, సీపీఐ(ఎం)గా విడిపోయాయి. ఎన్నికల సంఘం సీపీఐకి కంకి, కొడవలి, సీపీఐ(ఎం)కు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తులను కేటాయించింది. 1970 లో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలగా ఇందిరాగాంధీకి ఆవుదూడ గుర్తు రాగా , మరోసారి కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిన సమయంలో 1978లో ఇందిరాగాంధీ హస్తం గుర్తు స్వీకరించారు. ఇక అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీది చెయ్యి గుర్తుగా కొనసాగుతోంది.

పోక్సో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్రీనివాస్



సిరిసిల్లటౌన్: ఇటీవల ఏర్పాటైన జిల్లా పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పెంట శ్రీనివాస్ విధుల్లో చేరారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన శ్రీనివాస్ 2007లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. పదహారేళ్లుగా న్యాయవాదిగ ఉంటున్న ఆయన ఇప్పటి వరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అసిస్టెంట్ చీఫ్‌గా కొనసాగుతున్నారు. ఆ పోస్టుకు రాజీనామా చేసి గురువారం పోక్సో కోర్టు పీపీగా బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.

క్లుప్తంగా

చొప్పదండి అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ



ప్రచారం చేస్తున్న శోభ

బోయినపల్లి(చొప్పదండి): చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు బొడిగె శోభ అన్నారు. గురువారం బోయినపల్లి మండలంలోని గుండన్నపల్లి, వెంకట్రావుపల్లి, దేశాయిపల్లి, రామన్నపేట, రత్నంపేట తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే నియోజకవర్గంలోని అన్ని గ్రామలను మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, నాయకులు మేకల ప్రభాకర్‌యాదవ్, ఉదారి నర్సింహాచారి, సుంకపాక ప్రభు, కొండం శ్రీనివాస్‌రెడ్డి, ఎడవెల్లి పర్శరామ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కొనుకటి హరీశ్ తదితరులున్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ దొందూ దొందే

- సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు



సిరిసిల్లటౌన్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు దొందూ..దొందేనని వారిని ప్రజలు విశ్వసించబోరని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఎన్నికల్లో మంత్రి కేటీఆర్‌ను గెలిపించుకోవడానికే బీజేపీ అభ్యర్థిగా స్థానికేతరులకు టిక్కెట్ ఇచ్చారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇరు పార్టీ లకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పంతం రవి, సోమ నాగరాజు, కడారి రాములు పాల్గొన్నారు.

భవనం పై నుంచి పడి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ముష్కం శ్రీనివాస్‌గౌడ్ బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు భవనం పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఓ భవనంపైన ప్లాస్టిక్ వాటర్ ట్యాంకర్‌ను పెడుతుండగా కాలు జారి భవనం పై నుంచి కిందపడ్డాడు. వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ



రవిప్రకాశ్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ పోటీల్లో మండలంలోని బొప్పాపూర్‌కు చెందిన జ్ఞానదీప్ స్కూల్ విద్యార్థి చల్ల రవిప్రకాశ్‌రెడ్డి ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ రిన్సీ జార్జ్, కరస్పాండెంట్ మిట్టపల్లి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆన్‌లైన్ అవస్థలు

- విద్యార్థుల వివరాల నమోదులో ఇబ్బంది
- సమాచార సవరణకు లేని అవకాశం
- యూడైస్ ప్లస్‌పై విమర్శలు
- విద్యార్థులకు నష్టం జరగనివ్వబోమన్న విద్యాశాఖ

జిల్లాలోని పాఠశాలల సమాచారం

ప్రభుత్వ పాఠశాలలు	: 519
విద్యార్థులు	: 55,511
ప్రైవేటు పాఠశాలలు	: 122
విద్యార్థులు	: 21,32



ఫేస్ రికగ్నైజేషన్‌తో హాజరు వేస్తున్న ఉపాధ్యాయుడు

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యాలయాల్లో విద్యార్థుల నమోదుకు ప్రస్తుతం అవలంబిస్తున్న యూడైస్ ప్లస్ అవస్థలు అధికమవుతున్నాయి. విద్యార్థుల నమోదు నుంచి వివరాల సవరణకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం విద్యాశాఖలో అమలవుతున్న ఫేస్ రీడింగ్ హాజరు, యూడైస్ ప్లస్‌లో వివరాల నమోదు తలనొప్పిగా మారిందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

అస్తవ్యస్తంగా యూడైస్ ప్లస్

పాఠశాలల్లోని ప్రతీ విద్యార్థి సమాచారం ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో యూడైస్ ప్లస్ పేరిట ఓ వెబ్‌సైట్‌ను రూపొందించారు. దీనిలో నమోదైన విద్యార్థికి పర్మినెంట్ నంబర్ ఇస్తున్నారు. దేశంలో ఎక్కడ విద్యనభ్యశించిన ఈ నంబర్‌తో విద్యార్థి వివరాల సేకరణకు వీలుంటుంది. దీన్ని ఒకేసారి అమలు చేయడం వల్ల ఇన్నాళ్లు ఆన్‌లైన్‌లో ఏదేని సమస్యతో పేర్లు నమోదుకాని విద్యార్థులుంటే వారి వివరాలు సరిచేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో విద్యార్థులు గతంలో విద్యనభ్యశించిన విద్యాలయాల నుంచి విద్యాభ్యాస సర్టిఫికెట్లు ఉన్నా వాటితో పై తరగతికి వెళ్లలేని స్థితి ఏర్పడింది. మార్పులు, చేర్పులు, కొత్తగా అన్ని తరగతుల్లో నమోదుకు అవకాశం కల్పించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

టెన్త్ విద్యార్థుల్లో మొదలైన టెన్షన్

ఇన్నాళ్లు విద్యార్థుల వివరాలను యూడైస్‌లో నమోదు చేశారు. ఆ సమయంలో వివరాలు సరిగ్గా లేకుంటే వాటిని సరిచేసేందుకు ప్రస్తుతం అమలులో ఉన్న యూడైస్ ప్లస్‌లో వీలులేదు. అయితే పదో తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల నిమిత్తం నామినల్‌రూల్స్ వస్తాయి. యూడైస్ ప్లస్‌లో పర్మినెంట్ నంబర్ ఉన్న విద్యార్థులకు మాత్రమే టెన్త్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు వీలుందని ఇటీవల ఓ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వీడియోతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. నిజంగానే పర్మినెంట్ నంబర్ ఉన్న విద్యార్థులు మాత్రమే పరీక్షకు అర్హులను, తప్పులను సరిచేసుకునే అవకాశం ఉండదంటే దాదాపు 25 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు దూరమవుతారని సీనియర్ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

ఒకటో తరగతిలో నమోదు అవకాశం

ప్రస్తుతం అమలులో ఉన్న యూడైస్ ప్లస్‌లో ఒకటో తరగతిలో ప్రవేశాలు తీసుకున్న వారి వివరాల నమోదుకు మాత్రమే అవకాశం ఉంది. 2 నుంచి 10వ తరగతిలో విద్యార్థులను నేరుగా నమోదు చేసే అవకాశం లేదు. దీనిపై విద్యాశాఖలోని టెక్నికల్ పర్సన్స్‌ను అడిగితే సవరింపులకు అవకాశం వస్తుందంటున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న ఫేస్ రికగ్నైజేషన్ రిజిస్ట్రేషన్, అటెండెన్స్ వేయడానికి తీసుకొచ్చిన యాప్‌లో అనేక అవాంతరాలున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ఆధునిక విధానాలతో అవస్థలు



విద్యార్థుల హాజరుకు సంబంధించి నూతన విధానాలు ఆచరనీయమే కానీ అందుకు తగ్గట్లు సౌకర్యాలు కల్పించాలి. పిల్లల హాజరు కోసం ఫేస్ రికగ్నైజేషన్‌కు మొదటి పీరియడ్ పోతుంది. అలాగే యూడైస్ స్థానంలో వచ్చిన యూడైస్ ప్లస్‌లో సవరణలకు అవకాశం ఇవ్వాలి. వచ్చిన మార్పులను సరిచేయకుంటే ఆధునిక విధానాలతో అవస్థలు పడాల్సి వస్తుంది విద్యాశాఖ అధికారులు గమనించాలి.

– భూపాల్‌రెడ్డి, టీపీటీఎఫ్ అధ్యక్షుడు, సిరిసిల్ల

టెక్నికల్ సమస్యలు సరిచేస్తాం



విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్‌లో నమోదులో మార్పులు, చేర్పులను నిర్ణీత నిబంధనలతో అవకాశం ఇచ్చేందుకు అవకాశం ఉంది. అలాగే విద్యార్థులు ఎక్కడ నమోదు లేనట్లు తేలితే వారి వివరాలను పరిశీలించి నమోదు చేసేందుకు ఒక సమయం ఇచ్చే అవకాశం ఉంది. ఫేస్ రికగ్నైజేషన్ అటెండెన్స్, రిజిస్ట్రేషన్‌లో ఉన్న టెక్నికల్ సమస్యలు సరిచేస్తాం.

– శ్రీధర్, సెక్టోరల్ ఆఫీసర్ సమగ్ర శిక్ష, సిరిసిల్ల

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ



రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎన్నికల నిబంధనలు పాటిస్తూ.. పారదర్శకంగా పని చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లెలోని జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును గురువారం తనిఖీ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతున్న నేపథ్యంలో చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉండే వారు బాగా పని చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించవద్దని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ సదన్‌కుమార్, ఎస్సై శేఖర్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ దేవరాజు, వంశీకృష్ణ తదితరులున్నారు.

డీసీసీ అధ్యక్షుడిపై అభిమానం

- రుద్రంగి లక్ష్మీనృసింహునికి పూజలు చేయించిన గంగపుత్రులు



పూజలు చేస్తున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి(వేములవాడ): డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌పై అభిమానంతో ఆయన రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని రుద్రంగి మహాలక్ష్మి గంగపుత్ర సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక శ్రీ ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఆయనను ఆహ్వానించి, ప్రత్యేక పూజలు చేయించారు. గెలుపు కోసం ముడుపు కట్టించారు. అనంతరం గంగపుత్ర సంఘం సభ్యులు కాంగ్రెస్‌లో చేరగా శ్రీనివాస్ కండువాలు కప్పి, ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో భూమేశ్, గంగాధర్, రాజేందర్, భూమయ్య, గిరిధర్, నర్సయ్య తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీమణి ప్రచారం



ప్రచారం చేస్తున్న చల్మెడ సతీమణి సునీల

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం మారుపాకలో బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు సతీమణి సునీల ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో మారుపాక సర్పంచ్ స్వయంప్రభ, మహిళా నాయకులు పాల్గొన్నారు.

32.7 కేజీల గంజాయి దహనం



సిరిసిల్ల క్రైం: డిస్ట్రిక్ట్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం 32.7 కేజీల గంజాయిని పోలీసులు కాల్చివేశారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన 41 కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారి, తమ భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో గంజాయి రవాణాను పోలీసులు సమర్థంగా నిరోధిస్తున్నారని పేర్కొన్నారు. గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలను రవాణా చేసేవారిపై పీడీ యాక్టు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉదయ్ రెడ్డి, ఆర్‌ఐ యాదగిరి, సీఐ ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

మేధావులు మద్దతు పలకాలి

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



వేములవాడ: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునేందుకు మేధావులు బీఆర్‌ఎస్‌కు మద్దతు పలకాలని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. వేములవాడ కోర్టు హాల్‌లోని బార్ అసోసియేషన్‌లో గురువారం అడ్వకేట్లతో సమావేశమయ్యారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



స్పందన (ఎడమ వైపు)

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్ -14 ఎస్జీఎఫ్ పోటీలకు బోయినపల్లి మండలంలోని విలాసాగర్ హైస్కూల్ విద్యార్థిని సంపంగి స్పందన ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పీఈటీ మధుకర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జోనల్ స్థాయి పోటీలు సైదాపూర్ మండలంలో ఇటీవల జరగగా పాఠశాల నుంచి స్పందన, హారిక పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన స్పందన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ మేరకు ఇద్దరు విద్యార్థినులను గురువారం పాఠశాలలో అభినందించారు. ఉపాధ్యాయులు రాజిరెడ్డి, శోభారాణి, వెంకటహనుమాన్, సురేందర్‌రెడ్డి, మధుసూదన్, జ్యోత్స్నారాణి, ప్రకాశ్, రాధిక, మోహనకృష్ణ, వసుంధర, షఫియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మొద్దు



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే బాలకిషన్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని కందికట్కూర్‌కు చెందిన 50 మంది బీజేపీ కార్యకర్తలు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి, ఆహ్వానించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మోసపూరిత హామీలను నమ్మొద్దని ప్రజలను కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి ఏర్పడుతుందని, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వైస్ చైర్మన్ వేణు

ఆరెపల్లిలో బీఆర్‌ఎస్ ప్రచారం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మానకొండూరు ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ హ్యాట్రిక్ విజయం సాధిస్తారని జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. గురువారం ఇల్లంతకుంట మండలంలోని ఆరెపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామానికి చెందిన బీజేపీ మండల మాజీ అధికార ప్రతినిధి దార వేని తిరుపతి ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సర్పంచ్ తిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ కిషన్, నాయకులు సూర్య గౌడ్, మోహన్‌రావు, స్వామి, చరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ వల్లే కాంగ్రెస్‌లో చేరికలు

- చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం



మాట్లాడుతున్న సత్యం

బోయినపల్లి(చొప్పదండి): కాంగ్రెస్‌కు ప్రజల్లో ఆదరణ పెరగడం వల్లే పార్టీలో చేరికలు జరుగుతున్నాయని చొప్పదండి నియోజకవర్గ అభ్యర్థి మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలంలోని మల్లాపూర్ ఉపసర్పంచ్ అనిత, వార్డుసభ్యులు వేసిరెడ్డి అమర్‌నాథ్, ఐల శివరామ్, అద్దంకి మాధవి రమేశ్, మంత్రి మణెమ్మ, మంత్రి లచ్చయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ ఆకుల రవి, మోహన్, దాసరి బాబు తదితరులు మల్లాపూర్‌వాసి, దుబాయిలో ఉంటున్న వారాల నర్సింగం ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సత్యం కండువాలు కప్పి, ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఉయ్యాల శ్రీనివాస్, నాయకులు ఏనుగుల కనకయ్య, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, ముంజె సతీశ్‌గౌడ్, ముత్యం శంకర్, పిట్టల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయంపై దాడి కేసులో 11 మందికి జైలు

సిరిసిల్ల క్రైం: తహసీల్దార్ కార్యాలయంపై దాడి చేసిన 11 మందికి ఏడాది సాధారణ జైలుశిక్షతో పాటు రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. నిమ్మపల్లికి చెందిన ఉప్పర కులస్తులు జవ్వాజి పూజ, విమల, చంద్రకళ, మేదరి దేవయ్య, బండ రాజయ్య, బండ సత్తయ్య, పూజమ్ రాజయ్య, గంగాధర్, పూజం లింగయ్య, రెడ్డిమల్ల లచ్చయ్య, మ్యాదరి మధు, జవ్వాజి గంగాధర్‌లు 19 ఫిబ్రవరి 2017లో కోనరావుపేట తహసీల్దార్ ఆఫీస్‌లోకి దౌర్జన్యంగా చొరబడి, సిబ్బందిని బయటకు వెళ్లగొట్టారు. కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. అప్పటి తహసీల్దార్ డి.నాగరాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.మాలకొండరాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపారు. అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ మోహన్ సాక్షులను ప్రవేశపెట్టగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి శిక్ష ఖరారు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కోనరావుపేట ఎస్‌ఐ ఆంజనేయులు హెచ్చరించారు.

యథేచ్ఛగా అటవీ భూమి చదును

- అధికారులు పట్టించుకోవడం లేదని లింగంపేటవాసుల ఆరోపణ



వీరునిగడ్డ ప్రాంతంలో నరికివేసిన టేకు చెట్లు

చందుర్తి(వేములవాడ): లింగంపేట శివారు వీరునిగడ్డ అటవీ ప్రాంతంలో 10 ఎకరాలకు పైగా భూమిని పలువురు యథేచ్ఛగా చదును చేస్తున్నారని గ్రామస్తులు గురువారం ఆరోపించారు. కట్టలింగంపేటకు చెందిన ఓ వ్యక్తి సహకారంతో ఇదంతా జరుగుతోందన్నారు. టేకు చెట్లను నరికివేస్తున్నారని, ప్రశ్నిస్తే మీ ఇష్టం ఉన్నచోట చెప్పుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వాపోయారు. అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ విషయమై వేములవాడ ఎఫ్‌ఆర్వో ఖలీలొద్దీన్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదన్నారు. చదును చేసిన భూమిని పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మైనారిటీల అభివృద్ధికి బీఆర్‌ఎస్ కృషి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆగయ్య, నాయకులు

సిరిసిల్ల అర్బన్: మైనారిటీల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ఎంతగానో కృషి చేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు ముజీబ్ ప్రచురించిన ముస్లింల అభివృద్ధి కరపత్రాలను గురువారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేసిందన్నారు. షాదీముబారక్, మైనారిటీ బంధు వంటి పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ముస్లింలందరూ బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పవర్‌లూమ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సీనియర్ నాయకులు చీటి నర్సింగరావు, జిందం చక్రపాణి, చాంద్ పాషా, సత్తర్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పాలన

- సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్ రెడ్డి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పాలన అందుతుందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో ఇంటింటికీ వెళ్లి, ఆరు గ్యారెంటీ పథకాలపై అవగాహన కల్పించారు. కూరగాయల మార్కెట్‌లో చిరు వ్యాపారులతో మాట్లాడారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, నాయకులు యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, గోలి వెంకటరమణ, మ్యాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క చాన్స్ ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఒక్క చాన్స్ ఇస్తే.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గౌడ సంఘం సభ్యులతో గురువారం సమావేశమయ్యారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, రేవంత్‌రెడ్డి టీం జిల్లా అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి, పసుల కృష్ణ, నాయకులు పందిర్ల లింగం, బుచ్చిలింగు సంతోష్, గంట ఆంజయ్య, ఒగ్గు బాలరాజుయాదవ్, బీపేట రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో హుండీ చోరీ

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్రంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో చోరీ జరిగింది. గర్భ గుడికి ఎదురుగా వున్న హుండీని బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. అందులో రూ.2 వేల వరకు ఉండవచ్చని పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై శేఖర్ గురువారం ఆలయానికి వచ్చి, వివరాలు సేకరించారు.

'ఎల్‌ఎండీ'లో దూకిన యువకుడు

- కుటుంబ కలహాలే కారణం
- దొరకని ఆచూకీ
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు



అభిలాష్

తిమ్మాపూర్(మానకొండూర్): కుటుంబ కలహాలతో ఓ యువకుడు మోయతుమ్మెద వాగు (ఎల్‌ఎండీ బ్యాక్ వాటర్)లో దూకిన ఘటన తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గన్నేరువరం మండలంలోని ఖాసీంపేటకు చెందిన సందెబోయిన అభిలాష్ అలియాస్ టింకు బుధవారం రాత్రి రేణికుంట శివారులోని రాజీవ్ రహదారి బ్రిడ్జి పైనుంచి ఎల్‌ఎండీ బ్యాక్ వాటర్‌లో దూకాడు. అంతకుముందు తన ఫోన్‌లో వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నాడు. అది చూసిన కుటుంబసభ్యులు వెంటనే ఎల్‌ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గురువారం ఉదయం గజ ఈతగాళ్లను రప్పించి, గాలింపు చేపట్టారు. ఇప్పటి వరకు అభిలాష్ ఆచూకీ దొరకలేదని ఎస్సై తెలిపారు.



వాగులో గాలిస్తున్న గజ ఈతగాళ్లు



రోదిస్తున్న కుటుంబసభ్యులు